క్లుప్తంగా

పంటలను కాపాడుతాం



సమావేశంలో ఎన్‌ఎస్‌పీ అధికారులు

బోనకల్: బోనకల్ బ్రాంచ్ కెనాల్‌కు రెండు రోజుల్లో సాగర్ నీరు విడుదల చేసి ఎండిపోతున్న మొక్కజొన్న పంటలను కాపాడతామని ఎన్‌ఎస్‌పీ ఎస్‌ఈ వాసంతి, ఈఈ రామకృష్ణ తెలిపారు. గురువారం ఆళ్లపాడులో రైతులతో నిర్వహించిన సమావేశంలో రైతులను పంటల పరిస్థితిపై వివరాలను సేకరించగా.. వారు మాట్లాడుతూ.. సాగర్ జలాలు రాకపోతే కళ్ల ముందే పంటలు ఎండిపోయి, తీవ్ర నష్టం ఏర్పడుతుందన్నారు. రెండురోజుల్లో నీటిని అందిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి వినయ్‌కుమార్, ఎన్‌ఎస్‌పీ ఏఈ పిల్లలమర్రి ఏడుకొండలు పాల్గొన్నారు.

వైభవంగా బొడ్రాయి ప్రతిష్ఠ



విగ్రహాల ఊరేగింపులో భక్తులు

చింతకాని: మండలంలోని ప్రొద్దుటూరు గ్రామంలో వేదపండితులు గురువారం బొడ్రాయి, ముత్యాలమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామదేవతల విగ్రహాలను గ్రామంలో ఊరేగించారు. భక్తులు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమలరాజ్, మధిర మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయకమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ప్రతిష్ఠ విగ్రహాలకు విశేష హోమాలు



హోమపూజలు నిర్వహిస్తున్న అర్చకులు

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లిలోని ద్వారకాపురి కాలనీలో ఈ నెల 9న ప్రతిష్ఠ జరగనున్న సందర్భంగా.. శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలోని ప్రతిష్ఠ విగ్రహాలకు గురువారం విశేష హోమ పూజలు నిర్వహించారు. వేదపండితులు ప్రతాపురం గిరిధరాచార్యులు ఆధ్వర్యంలో 22మంది రుత్వికులతో లాజాధివాసం, అధివాస హోమాలు నిర్వహించారు. హనుమాన్ భక్తబృందంతో హనుమాన్ చాలీసా పారాయణం, ద్రోణంరాజు మల్లికార్జునశర్మ బృందంతో సర్వనామ సంకీర్తనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు రాగాల చంద్రారెడ్డి, వందనపు సత్యనారాయణ, సోమిశెట్టి శ్రీధర్, ఉబ్బల వెంకటేశ్వరరావు, రమేష్‌రెడ్డి, వంగరి రాకేష్, నాగు పాల్గొన్నారు.

13న వేంకటేశ్వరస్వామి కల్యాణం

కారేపల్లి: కారేపల్లిలో శ్రీవేంకటేశ్వర స్వామి (సంతగుడి) దేవాలయంలో ఈ నెల 13న ఉదయం 10గంటలకు పద్మావతి సహిత వేంకటేశ్వరుడి కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి నల్లమోతు శేషయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమం, సాయంత్రం 6గంటలకు స్వామివార్ల ఊరేగింపు కార్యక్రమం ఉంటుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి తీర్థప్రసాదాలు స్వీకరించాలన్నారు.

సాయినాధుడికి ప్రత్యేక పూజలు

ఎర్రుపాలెం: మండలంలోని బనిగండ్లపాడు, తక్కెళ్లపాడు, బీమవరం సాయిబాబా ఆలయాల్లో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకాలు, అర్చనలు చేశారు. అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

నియామకం..



చల్లా సత్యం

కొణిజర్ల: అర్బన్ లోకల్ బాడీస్ ఫిజికల్లీ ఛాలెంజ్‌డ్ పర్సన్స్ అసోసియేషన్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా కొణిజర్లకు చెందిన చల్లా సత్యం నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆకుల లింగమల్లు గురువారం నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ.. నిస్వార్థంగా నిజాయితీతో దివ్యాంగుల సంక్షేమం కోసమే పని చేస్తానన్నారు. తనను ఎంపిక చేసినందుకు రాష్ట్ర అధ్యక్షుడు లింగమల్లుకు, గౌరవ సలహాదారు మొక్క ఉపేందర్‌కు, ఎగ్జిక్యూటివ్ మెంబర్ శ్రీను లను ధన్యవాదాలు తెలిపారు.

ఆస్తిపన్ను వసూళ్లపై నజర్

- రంగంలోకి ప్రత్యేక బృందాలు
- నూరుశాతం వసూళ్లే సిబ్బంది లక్ష్యం
- ఈ నెలాఖరుతో ముగియనున్న ఆర్థిక సంవత్సరం



మున్సిపల్ కమిషనర్‌కి పన్ను చెల్లిస్తున్న ప్రైవేట్ స్కూల్ యాజమాన్యం



సత్తుపల్లి మున్సిపాలిటీ కార్యాలయం

మున్సిపాలిటీ	ఆస్తిపన్ను	వసూలు శాతం
సత్తుపల్లి	రూ. 4.90 కోట్లు	67.69 శాతం
వైరా	రూ. 4.07 కోట్లు	38.03 శాతం
మధిర	రూ. 2.56 కోట్లు	57.78 శాతం

సత్తుపల్లిటౌన్: మున్సిపాలిటీల్లో ఆస్తిపన్ను సేకరణపై అధికారులు దృష్టిసారించారు. ఈ ఆర్థిక సంవత్సరం నెలాఖరితో ముగియనుంది. గతేడాది కన్నా పన్నులు అధికంగా వసూలు చేయాలని యంత్రాంగం శ్రమిస్తోంది. ఈ నెలాఖరికల్లా ఆస్తిపన్ను లక్ష్యాన్నిసాధించేలా మున్సిపల్ అధికారులు కసరత్తు చేస్తున్నారు. సత్తుపల్లిలో ఇప్పటి వరకు రూ.3.32 కోట్లు, వైరాలో రూ.1.56 కోట్లు, మధిరలో రూ.1.48 కోట్లు చొప్పున ఆస్తిపన్నులు వసూళ్లు అయ్యాయి. వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు బృందం నిరంతరంస్పెషల్ డ్రైవ్ చేస్తూ.. ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. గడువు సమీపిస్తుండటంతో ఈ చర్యలను మరింత వేగవంతం చేస్తున్నారు.

విస్తృతంగా అవగాహన..

పన్నుల వసూళ్ల కోసం మున్సిపాలిటీల్లో పలు రకాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రధానంగా ఇంటింటికీ వెళ్లిపన్నులు చెల్లించాలని చెబు తూనే.. ఆటోలతో మైకుల ద్వారా పట్టణాల్లోని వాడ వాడలు, వార్డుల్లో ప్రచారం చేస్తున్నారు. మున్సిపల్ కమిషనర్, మేనేజర్, ఆర్‌ఐలు నిత్యం పర్యవేక్షణ చేస్తున్నారు. సెలవు దినాల్లోనూ అందుబాటులో ఉంటూ పన్నుల వసూళ్లలో నిమగ్నమయ్యారు. ఇంటి యజమానులు అందుబాటులో లేనట్లయితే ఫోన్లు చేసిమరీ.. పన్నులు చెల్లించండి.. పట్టణ ప్రగతికి సహకరించాలని అవగాహన పెంపొందిస్తున్నారు.

మొండి బకాయిల జాబితాతో..

మున్సిపాలిటీల్లో చాలాకాలంగా పన్నులు చెల్లించని మొండి బకాయిలు ఎన్ని ఉన్నాయో.. ఇప్పటికే జాబితాలు సిద్ధం చేశారు. ఆ జాబితాల ప్రకారం మొబైల్ ద్వారా, ప్రత్యక్షంగా యజమానిని కలసి పన్నులు వసూలు చేసే ప్రణాళికలో అధికార యంత్రాంగం నిమగ్నమైంది. కొందరు మొండి బకాయిదారులకు నోటీసులు జారీ చేస్తున్నారు.

ప్రతిరోజూ సమీక్ష..



ఈ ఆర్థిక సంవత్సరం పన్నుల లక్ష్యాన్ని సాధించేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నాం. ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు, అధికారులతో ప్రతిరోజూ సమీక్ష నిర్వహిస్తూ.. పన్నుల వసూలును వేగవంతం చేశాం. మొండి బకాయిదారులతో నేరుగా మాట్లాడి సహకరించాలని కోరుతున్నాం. ప్రజలు చెల్లించేందుకు సహకరిస్తున్నారు.

– కె.నరసింహా, కమిషనర్, సత్తుపల్లి మున్సిపాలిటీ

గోదావరి జలాలకు పూజలు



తల్లాడ : గోదావరి జలాలకు పూజలు చేస్తున్న నాయకులు

తల్లాడ: సీతారామ ప్రాజెక్టు ద్వారా విడుదల చేసిన గోదావరి జలాలతో జిల్లా సస్యశ్యామలం కానుందని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ఈమేరకు తల్లాడ మండలానికి నీరు వచ్చే లాక్‌ల వద్ద గురువారం నాయకులు పూజలు చేసి మాట్లాడారు. కాల్వల నిర్మాణం త్వరగా పూర్తి చేసి నీరు విడుదల చేయడంపై సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ నీటితో తల్లాడ మండలంలో రెండు పంటలు సాగవుతాయని చెప్పారు. నాయకులు కొమ్మినేని ప్రభాకర్, దిరిశాల నర్సింహారావు, రాయల రాము, వెంకటేశ్వరరావు, గోవింద్ శ్రీనివాసరావు, తూము వీరభద్రరావు, పొన్నం కృష్ణయ్య, గోగినేని తిరుమలరావు, నల్లమోతు మోహన్‌రావు పాల్గొన్నారు.

రెండున్నర దశాబ్దాల పోరాటం..

ఏన్కూరు: జిల్లా రైతాంగం రెండున్నర దశాబ్దాల పోరాట ఫలితంగానే గోదావరి జలాలు సాగర్ ఆయకట్టుకు అందుతున్నాయని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. మండలంలోని సాగర్‌కాల్వలో గోదావరి జలాలు చేరుతున్న ప్రాంతాన్ని పరిశీలించాక ఆయన మాట్లాడారు. సీపీఎం మాజీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మహా ప్రస్థానం పేరుతో 2005లో ఉద్యమించగా, ఉమ్మడి ఏపీ వైఎస్.రాజశేఖరరెడ్డి దుమ్ముగూడెం ప్రాజెక్టుకు శంకుస్థాపన చేస్తే, 2016లో అప్పటి సీఎం కేసీఆర్ సీతారామ ప్రాజెక్ట్ పేరుతో మరోసారి శంకుస్థాపన చేశారన్నారు. ఇప్పుడు లింక్ కెనాల్ పూర్తి చేసి నీరువిడుదల చేశారని తెలిపారు. నాయకులు దొంతెబోయిన నాగేశ్వరరావు, భూక్యా లక్ష్మా, నందూరి శ్రీనివాసరావు, వేల్పుల రాములు, ఎస్‌కే.జానీ, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి ఓబీ ఆపరేటర్ల సమస్యలు పరిష్కరించాలి



అభివాదం చేస్తున్న నాయకులు

సత్తుపల్లిటౌన్: సింగరేణి ఓబీ ఆపరేటర్ల సమస్యలను యాజమాన్యం, ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ట్రేడ్‌యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు ఎ.వెంకన్న, ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి సీవై.పుల్లయ్య కోరారు. గురువారం సత్తుపల్లిలోని టీయూసీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి ఓబీ కాంట్రాక్టు కార్మికులకు పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రతినెల 10వతేదీ లోపు వేతనాలు చెల్లించాలని, ఈపీఎఫ్ వేతనంలో కట్‌కాగానే మొబైల్‌ఫోన్లలో మెస్సేజ్‌లు పంపించాలన్నారు. సింగణిలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులను రెగ్యూలర్ చేయాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.రవి, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ అమర్లపూడి శరత్, అశోక్, రమేష్, రవికుమార్, మురళీకృష్ణ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాజశేఖర్

కల్లూరురూరల్: బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని జిల్లా సీఎం రాజశేఖర్, ఎంఈఓ పత్తిపాటి నివేదిత అన్నారు. గురువారం ముచ్చవరం గ్రామ పంచాయతీ పరిధిలోని విశ్వనాధపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండటంతో పాఠశాలను ఇటీవల మూసివేశారు. దీంతో కొందరు నిరుపేద విద్యార్థులు ప్రభుత్వ విద్యకు దూరమవుతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో నలుగురు విద్యార్థులను చేర్పించి వారికి ఒక టీచర్‌ను కేటాయించారు. అనంతరం పిల్లలకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందించారు. అదే విధంగా హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు సరాబు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు స్టేషనరీ అందించారు. ఈ కార్యక్రమంలో చెన్నూరు కాంప్లెక్స్ హెచ్‌ఎం మధుసూదన్‌రావు, ముచ్చవరం పాఠశాల హెచ్‌ఎం టి.వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు చాంద్‌సాహెబ్, అంగన్‌వాడీ సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు, సీఆర్పీలు ఆరిఫ్, వేలాద్రి, రవీందర్, కృష్ణయ్య, రాము, పాఠశాల ఇన్‌చార్జ్ ఉపాధ్యాయిని కల్యాణి పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

చింతకాని: మండలంలో పైలట్ గ్రామంగా ఎంపిక చేసిన రేపల్లెవాడ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఎంపీడీఓ శ్రీనివాసరావు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో అర్హులైన లబ్ధిదారులందరికీ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయటం జరిగిందని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి దశలవారీగా ప్రభుత్వం లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు జమచేయటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి రామారావు, కాంగ్రెస్ నాయకులు రాంప్రసాద్, శ్రీనివాసరావు, చిన్న భాస్కర్, కిరణ్‌బాబు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నారాయణపురంలో మంత్రి పొంగులేటి నూతన గృహానికి..

కల్లూరురూరల్: రాష్ట్ర రెవెన్యూశాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్వగ్రామం నారాయణపురంలో నూతనంగా నిర్మించతలపెట్టిన గృహానికి గురువారం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సతీమణి పొంగులేటి మాధురి, మంత్రి సోదరుడు పొంగులేటి ప్రసాదొరెడ్డి, సతీమణి శ్రీలక్ష్మి దంపతులు, పొంగులేటి మాతృమూర్తి స్వరాజమ్మ నూతన గృహ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో నారాయణపురం గ్రామస్తులు, పొంగులేటి అభిమానులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యారంగ అభివృద్ధికి పోరాటాలు చేస్తాం



మాట్లాడుతున్న నాగూర్ వలీ

మధిర: ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలతో నిరాశ చెందకుండా ప్రభుత్వ విద్యారంగం అభివృద్ధి, ఉపాధ్యాయుల సంక్షేమానికి టీఎస్‌యూటీఎఫ్ నిరంతరం పోరాటాలు చేస్తుందని ఆ యూనియన్ జిల్లా కార్యదర్శి షేక్ నాగూర్ వలీ తెలిపారు. గురువారం స్థానిక యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో నిర్వహించిన మండల ఆఫీస్ బేరర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో అలుగుబెల్లి నర్సిరెడ్డికి ఓటు వేసిన అందరికీ, గెలుపుకై సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. గెలుపోటములు సహజమని, ఎన్నికలే సర్వస్వం కాదని, సంఘం పనిలో ఎన్నికలు ఒక భాగం మాత్రమేనని అన్నారు. ఈ సమావేశంలో యూనియన్ మండల అధ్యక్షుడు నాగరాజు, ప్రాంతీయ కార్యాలయ కన్వీనర్ వినోదరావు, ప్రధాన కార్యదర్శి వీరయ్య, షేక్ ఇబ్రహీం, సునీత, చెన్నయ్య, మహేంద్ర, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా సెకండ్ ఇంటర్ పరీక్షలు



సత్తుపల్లిటౌన్: పరీక్షలకు హాజరైన విద్యార్థులు

సత్తుపల్లిటౌన్: ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం సత్తుపల్లిలో ప్రశాంతంగా జరిగాయి. పట్టణంలోని ఏడు పరీక్ష కేంద్రాల్లో 1,337 మంది విద్యార్థులకు గాను 1,260 మంది విద్యార్థులు హాజరుకాగా.. 77మంది గైర్హాజరయ్యారు. పరీక్షలను చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారులు పరీక్షలను పర్యవేక్షించారు.

10మంది విద్యార్థులు గైర్హాజరు..

కారేపల్లి: కారేపల్లిలోని కారేపల్లి మోడల్ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రాల్లో గురువారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమైయ్యాయి. మోడల్ కళాశాల పరీక్ష కేంద్రంలో 202మంది విద్యార్థులకు గాను, 193 మంది విద్యార్థులు హాజరై పరీక్షలు రాయగా, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 221మందికి 220 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. మొత్తంగా 10 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు సీఎస్‌లు ప్రేమ్‌కుమార్, వనిత తెలిపారు.

ముదిగొండ: ముదిగొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 145మంది ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థులకు గానూ.. 142మంది పరీక్షలకు హాజరైనట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. ముగ్గురు విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు.

ఎయిడ్స్‌పై కళాజాతా



అవగాహన కల్పిస్తున్న కళాబృందం

బోనకల్: మండల కేంద్రంలో రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ వారి ఆధ్వర్యంలో గురువారం కళాజాతా నిర్వహించారు. కళాబృందం సభ్యుడు ప్రేమ్‌కుమార్ పాటల ద్వారా, కళారూపాల ద్వారా హెచ్ఐవీ ఎలా సోకుతుందో వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ స్రవంతి మాట్లాడుతూ.. హెచ్ఐవీ లక్షణాలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రక్తదాన విశిష్టత, సుఖ వ్యాధుల లక్షణాలు, క్షయవ్యాధి లక్షణాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాబృందం సభ్యులు పోలూరి రాము, పల్లెసుద్దుల శ్రీను, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి



విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న భాస్కర్‌రెడ్డి

ముదిగొండ: విద్యార్థులు మంచిగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి ఆవుల భాస్కర్‌రెడ్డి అన్నారు. మండలంలోని బాణాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు గురువారం పాలిటెక్నిక్ గైడ్‌లను అందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎంలు వెంకట్రామిరెడ్డి, వట్టికూటి వెంకటేశ్వర్లు, కనపర్తి వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీనివాస్ కుటుంబానికి అండగా ఉంటాం

మధిర: ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన తన వ్యక్తిగత కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాస్ కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఖమ్మం పట్టణంలోని కరుణగిరి సమీపంలో గురువారం జరిగిన శ్రీనివాస్ దశదిన కర్మ కార్యక్రమంలో ఆయన పాల్గొని.. చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు.

పాఠశాలలో దంత వైద్యుల దినోత్సవం



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ హరి అర్చన

కొణిజర్ల: మండల కేంద్రంలోని సమత సూపర్ జెమ్స్ పాఠశాలలో గురువారం ప్రపంచ దంత వైద్యుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా తనికెళ్ల గ్రేస్ ఆస్పత్రి మేనేజర్ రంజిత్‌రెడ్డి ఆధ్వర్యంలో డెంటిస్ట్ డాక్టర్ హరి అర్చన విద్యార్థులకు దంత సమస్యలు, దంతాలు పరిశుభ్రంగా ఉంచుకునే విధానాలు వివరించారు. పాఠశాల ప్రిన్సిపల్ కొణతం ఉమాశంకరరావు, ఉపాధ్యాయులు, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

మిషన్ భగీరథ పవర్ గ్రిడ్ పరిశీలన



పవర్ గ్రిడ్‌ను పరిశీలిస్తున్న ట్రాన్స్‌కో డీఈ రామారావు

కొణిజర్ల: తనికెళ్ల సమీపంలోని ముక్రిహిల్స్‌పై ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ వాటర్ గ్రిడ్‌ను ట్రాన్స్‌కో ఆపరేషన్ డీఈ నంబూరి రామారావు గురువారం పరిశీలించారు. రాబోవు వేసవి దృష్ట్యా విద్యుత్ పరికరాలు పని తీరును పరిశీలించారు. వేసవిలో నీటి సమస్య ఉత్పన్నం కాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పెద్దగోపతి సబ్‌డివిజన్ ఏడీఈ ఎల్.తిలక్, ఏఈ రాయల సురేష్, మిషన్ భగీరథ సిబ్బంది పాల్గొన్నారు.

ఏన్కూరులో 20న మహాధర్నా



మాట్లాడుతున్న వీరభద్రం

ఏన్కూరు: ఎన్నికల ముందు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ.. సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల 20న నిర్వహించ తలపెట్టిన మహాధర్నాను జయప్రదం చేయాలని సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం పిలుపునిచ్చారు. గురువారం ఏన్కూరులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 10 నుంచి సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో గ్రామాల్లో పర్యటించి ప్రజల ఎదుర్కొంటున్న సమస్యలపై సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి నాగేశ్వరరావు, సత్యనారాయణ, రాములు, సాయికుమార్, లచ్చునాయక్, శ్రీనివాసరావు, జయ, రవి తదితరులు పాల్గొన్నారు.

మనవరాలితో సహా మహిళ అదృశ్యం

చింతకాని: చింతకాని గ్రామానికి చెందిన మహిళ ధనమ్మ కానరాకుండా పోవడంతో ఆమె కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. జనవరి 15న ఇంటి నుంచి ఐదేళ్ల మనమరాలు లక్ష్మితో వెళ్లిన ధనమ్మ కోసం ఎక్కడ వెతికినా ఆచూకీ తెలియరాలేదు. దీంతో ఆమె భర్త జానయ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు

సత్తుపల్లిటౌన్: ఈ వేసవిలో తాగునీటి సరఫరా బోర్లు, ప్రభుత్వాస్పత్రిలో వైద్య సేవలకు విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని సత్తుపల్లి విద్యుత్‌శాఖ డీఈఈ ఎల్.రాములు స్పష్టం చేశారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, తాగునీటి బోర్లను మున్సిపల్ కమిషనర్ కె.నర్సింహా, డాక్టర్ సాత్విక్‌లతో కలిసి పరిశీలించారు. ఆస్పత్రుల్లో విద్యుత్ అధికారుల ఫోన్ నంబర్లతో బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. మున్సిపాలిటీలోని 40 తాగునీటి బోర్లకు విద్యుత్ అంతరాయం లేకుండా అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట ఏఈ శరత్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాటాలు ఉధృతం



మాట్లాడుతున్న భారతి

తల్లాడ: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరించిందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు మాచర్ల భారతి అన్నారు. గురువారం తల్లాడలో నిర్వహించిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 450 రోజులవుతుంది.. కానీ, అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే హామీలన్నీ అమలు చేస్తామని చెప్పి వాగ్దానాలను తుంగలో తొక్కిందన్నారు. ఈ సమావేశంలో సీపీఎం సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, రామలింగేశ్వర్‌రావు, కృష్ణయ్య, ఫకీరమ్మ, చెన్నయ్య, నన్నేసాహెబ్, బిక్షం పాల్గొన్నారు.

నూతన భవనంలో వైద్యసేవలు

ఎర్రుపాలెం: మండలంలోని బనిగండ్లపాలెం పీహెచ్‌సీలో నూతనంగా నిర్మించిన భవనంలో గురువారం వైద్యసేవలు ప్రారంభించారు. వైద్యులు ప్రశాంత్, రంజిత్, కార్తీక్, అశ్విని రాథోడ్, లక్ష్మీ లోహిత, శశిపూర్ణిలు నూతన భవనంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూతన భవనంలో రోగులకు మెరుగైన సౌకర్యాలు ఉన్నాయని.. సద్వినియోగం చేసుకోవాలన్నారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు వైద్యులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎస్ఐ వెంకటేష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రవన్న వర్ధంతి సభను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న అచ్చయ్య

కొణిజర్ల: ఖమ్మంలో ఈనెల 9న నిర్వహించే కామ్రేడ్ రాయల సుభాష్ చంద్రబోస్(రవన్న) వర్ధంతి సభను జయప్రదం చేయాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు గుర్రం అచ్చయ్య పేర్కొన్నారు. గురువారం మండలంలోని గుబ్బగుర్తిలో అర్జునరావు అధ్యక్షతన నిర్వహించిన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారానికి రాయల చేసిన సేవలు మరువలేనివని తెలిపారు. అంతకు ముందు గ్రామంలో కార్యకర్తలు భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అర్జునరావు, షేక్ లాల్‌మియా, అప్పారావు, సోములు, సీతారాములు, శ్రీనివాస్, కృష్ణ, రమేష్, బాబు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

11న భక్తరామదాసు కళాక్షేత్రంలో..

కారేపల్లి: ఈ నెల 11న ఖమ్మంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో నిర్వహించే రాయల శుభాష్ చంద్రబోస్ 9వ వర్ధంతి సభను జయప్రదం చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి వై ప్రకాశ్ అన్నారు. గురువారం రాత్రి మాధారం గ్రామంలో వర్ధంతికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాసమస్యలపై నిరంతరం పోరాడేది కమ్యునిస్టులేనని, మోసపూరిత హామీలతో పేద ప్రజలను దగా చేసే పాలక ప్రభుత్వాల ఆటలు ఇంకా ఎన్నో రోజులు సాగవన్నారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ నాయకులు కోయల శ్రీనివాస్, కావేటి నాగేశ్వరరావు, గడ్డం వెంకన్న, నరేష్, ఎర్రయ్య, ప్రసాద్, హరీష్, నరసింహారావు,రమేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.